క్లుప్తంగా

ట్రాక్టర్ల పంపిణీ



అందజేసిన ట్రాక్టర్‌తో రైతు

శిరివెళ్ల: మండలంలో వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద శుక్రవారం 3 రైతు మిత్ర సంఘాలకు ట్రాక్టర్లను పంపిణీ చేసినట్లు ఏఓ సుధాకర్ తెలిపారు. శిరివెళ్ల 3వ గ్రామ సచివాలయం పరిధిలోని భారత్ రైతు మిత్ర సంఘం , శిరివెళ్ల 4 సచివాలయంలో బీఆర్ అంబేడ్కర్ సంఘానికి, గోవిందపల్లె-1వ గ్రామ సచివాలయ పరిధిలోని శ్రీ వెంకటేశ్వరరైతు మిత్ర సంఘానికి ట్రాక్టర్లు అందజేస్తామని చెప్పారు.

ఐదు ట్రాక్టర్లు మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రెండవ విడతలో 5 గ్రూపులు ఎంపికయ్యాయని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్.పాంపల్లె, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, సుద్దమల్ల, బోడెమ్మనూరు గ్రామాల్లోని గ్రూపుల్లోని సభ్యులకు 5 ట్రాక్టర్లు మంజూరయ్యాయని చెప్పారు. వాటి పూర్తి ధర రూ. 38,91,437 కాగా.. ప్రభుత్వం సబ్సిడీ రూ.15,50,719ని గ్రూపు సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని ఏఓ వివరించారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



టి.లింగదిన్నెలో బండలాగుతున్న ఎద్దులు

రుద్రవరం: టీ.లింగదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం వేద పండితులు ఉదయం నుంచి సాయంత్రం వరకు యాగశాల ప్రవేశం ,అగ్ని ప్రతిష్ఠ, మహాకుంభస్థాపన, చక్ర మండలారాధన, జలాధివాసం, నయనోన్మీలనం, రక్షాబంధనం, మృత్తికాస్నానం, చతుస్థానార్చన, 17కలశ తిరుమంజనం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గ్రామ పెద్దలు సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొని గెలుపొందిన ఎద్దులకు ప్రకటించిన మేరకు వరుసగా పది నగదు బహుమతులు అందజేశారు.

ప్రత్యేక సెలవుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): కేజీబీవీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక సెలవులు మంజూరు చేయడంపై పీఆర్‌టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం నాయకుడు కె.శ్రీనివాసులు శుక్రవారం మాట్లాడుతూ ఉపాధ్యాయులు చాలా కాలంగా అప్లయ్ చేసిన సంపాదిత సెలవుల మొత్తం వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ఖాళీలు బ్లాక్ చేయకుండా చూపించాలని, 2020-2 లో విలీనమైన పాఠశాలలకు విల్లింగ్ ఇచ్చిన ఎస్‌జీటీలకు 5 పాయింట్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణారావు, భాస్కరరెడ్డి, విజయరావు, హనుమంతు, జగదీష్, శ్రీధర్‌రెడ్డి, శ్యాంరాజ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వనరులను పొదుపుగా వాడుకోవాలి

ఆళ్లగడ్డ: వేసవి కాలంలో శక్తి వనరులను ప్రజలు పొదుపుగా వాడుకోవాలని ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులురెడ్డి, ఎఫ్‌బీఓ రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని గూబగుండం మెట్ట, పేరాయిపల్లె మెట్ట వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పర్యావరణ హిత జీవనశైలి మాసోత్సవం సందర్భంగా కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. శక్తివనరులు, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఎలాక్ట్రానిక్ వస్తువల వాడకం తగ్గించడంతో పాటు ప్లాస్టిక్‌ను వినియోగించరాదని చెప్పారు. సుస్థిరమైన ఆహార పద్ధతులను అలవర్చుకొని వ్యర్థాలను తగ్గించాలన్నారు. ఇంటింటికీ ఒక మొక్కను బాధ్యతగా నాటుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. చెలిమ కూప్ ఫారెస్టర్ నాణెమ్మ, ప్రొటెక్షన్ వాచర్ దానమయ్య పాల్గొన్నారు.

గడ్డి వాములు దగ్ధం



ఉయ్యాలవాడ : మండలంలోని అల్లూరు గ్రామంలో బుడ్డా దస్తగిరిరెడ్డి, చిన్నదస్తగిరిరెడ్డికి చెందిన రెండు గడ్డివాములు శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని అగ్నికి ఆహుతయ్యాయి. విషయాన్ని గ్రామస్తులు ఆళ్లగడ్డ అగ్నిమాపక దళానికి తెలియజేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.2 లక్షల విలువైన పశుగ్రాసం నష్టపోయామని బాధిత రైతులు వాపోయారు.



రుద్రవరం సమీపంలో మిర్చి పంటలో కలుపు తొలగిస్తున్న కూలీలు



నర్సాపురం సమీపంలో సాగు చేసిన పత్తి పంట



ఆలమూరు వద్ద రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలు

ముమ్మరంగా పంటల సాగు

- మే మొదటి వారంలోనే నాటిన విత్తు
- ఏపుగా పెరుగుతున్న మిర్చి, మొక్కజొన్న, పత్తి పంటలు



చిత్రేనిపల్లె వద్ద మొక్కజొన్నకు నీరు పారించిన దృశ్యం

రుద్రవరం: మండలంలో పంటల సాగు ముమ్మరంగా సాగుతోంది. మే నెల మొదటి వారంలోనే ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ మిర్చి,పత్తి,మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. ఆయా పంటలు ప్రస్తుతం ఏపుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం రైతులు పంటలకు బోర్ల నుంచి నీటి తడులు అందించడం, కూలీల కలుపు తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. సాధారణంగా జూన్ మాసంలో తొలకరి వర్షాలు కురిసినప్పుడు ఖరీఫ్ సాగు మొదలయ్యేది. అయితే ఈ ఏడాది ముందస్తుగా పంటలు సాగు చేశారు. రుతుపవనాల రాక ఆలస్యం అవుతుంది, ఎండలు మండుతున్నాయి పంటలు సాగు చెయ్యొద్దని అధికారులు హెచ్చరిస్తున్నా అన్నదాతలు పంటలు సాగు చేస్తున్నారు. మండల కేంద్రమైన రుద్రవరం, రెడ్డిపల్లె, ఆర్.నాగులవరం, టి.లింగందిన్నె,ఆలమూరు తదితర గ్రామాల పరిధిలో మిర్చి పంట, నర్సాపురం వైపు పత్తి, ఆలమూరు, చిత్రేనిపల్లె,ముకుందాపురం, తండా,హరినగరం తదితర గ్రామాల వైపు మొక్క జొన్న పంటలు సాగు చేశారు. దిగుబడులకు మంచి ధరలు లభిస్తాయనే ఆశతో ముందస్తు సాగుకు మొగ్గు చూపామని రైతులు పేర్కొంటున్నారు. కాగా.. ఓ వైపు రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్క జొన్న పంట కోతలు, విక్రయాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఇంతలోనే ఖరీఫ్ సీజన్ మొదలైంది. అయితే ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలు తమకు కొంత మేలు చేసిందని, వర్షాల రాకపై ఆశలు పెట్టుకున్నట్లు వారు చెబుతున్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 4వ తేదీన నంద్యాలలో జరిగే ఆవాజ్ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌వలి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రెజర్ల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఎంపీని అరెస్ట్ చేసి క్రీడాకారిణులకు న్యాయం చేయాలని కోరారు. దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన ఆటగాళ్లకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

సమయపాలన అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): వార్డు శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులకు సమయ పాలన అమలు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు,సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి వినత పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో డిగ్రీ, పీజీ చదివిన వారికి శానిటరీ మేస్త్రీ విధులు అప్పగించడం, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు కూడా 5 గంటలకు రావాలనే ఆదేశాలు ఇవ్వడం శోచనీయమన్నారు. సచివాలయ ఉద్యోగులను 12గంటలు పని చేస్తున్నారని, టెక్నికల్ వర్క్ కాకుండా వివిధ రకాల పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ నాయకుడు నాగరాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, ఎర్రిస్వామి, కలాం పాల్గొన్నారు.

పట్టు సాగు పెంపునకు కృషి చేయండి



తంగెడంచ ఫాంను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీధర్

నంద్యాల (సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా పట్టు పరిశ్రమ సాగు పెంపునకు అధికారులు కృషి చేయాలని కమిషనర్ శ్రీధర్ సూచించారు. గురువారం పత్తికొండలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటనకు హాజరై, తిరుగు ప్రయాణంలో తంగెడంచ ఫాంను తనిఖీ చేశారు. వివరాలను ఉప సంచాలకురాలు పరమేశ్వరి శుక్రవారం తెలిపారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో రైతన్నలు షెడ్లు, మల్బరీ తోట వేర్వేరు ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకుంటామనే ప్రతిపాదనపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పట్టు పరిశ్రమ లాభదాయకమైన ఆదాయ వనరని, రైతన్నలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. సహాయ సంచాలకులు నగేష్, ఫాం సిబ్బంది పాల్గొన్నారు. ఏడీపి మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి గాను 350 ఎకరాల్లో పట్టు పరిశ్రమ సాగుకు లక్ష్యం నిర్దేశించినట్లు పరమేశ్వరి తెలిపారు. ఇప్పటి వరకు 102 ఎకరాలకు సంబంధించి 27 మంది రైతులను గుర్తించామని చెప్పా

నివాళి



చక్రవర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన చక్రవర్తి అనే డిగ్రీ విద్యార్థి పిడుగు పడటంతో గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని విద్యార్థికి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. చక్రవర్తి తల్లిదండ్రులైన ఓబయ్య, ఓబులమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా వుంటామని అభయమిచ్చారు. నాయకులు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సింగిరెడ్డి దస్తగిరిరెడ్డి, సుబ్బారెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య సంతాపం వెలిబుచ్చారు.

తల్లిదండ్రుల క్రమశిక్షణే పిల్లల భవిష్యత్‌కు పునాది



విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు

నంద్యాల టౌన్: తల్లిదండ్రుల క్రమశిక్షణే పిల్లల భవిష్యత్‌కు పునాది అని జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటరాముడు అన్నారు. శుక్రవారం వరల్డ్ విజన్ ఇండియా నంద్యాల ప్రాంతీయ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మధుమణి నర్సింగ్ హోంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నంద్యాల మండలంలోని 8 గ్రామాలకు చెందిన 360 విద్యార్థులకు స్కూల్ కిట్స్, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను చదివించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని, విద్యార్థులు మంచి విద్యావేత్తలుగా ఎదగాలన్నారు. యువత చెడు వ్యసనాలు మాని భవిష్యత్‌పై దృష్టి సారించాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల మాట్లాడుతూ పిల్లలకు 18 సంవత్సరాలు నిండే వరకు చదువుకోవటానికి అవకాశం ఇవ్వాలని చెప్పారు. బాల్యంలోనే వివాహాలు చేయడం సరికాదన్నారు. సంస్థ సిబ్బంది జెస్సీ అరుణ్ కుమార్, రవి కుమార్ జోషి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డేను ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, హోమ్ గార్డ్స్‌ల వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిపై సత్వరమే పరిష్కార చర్యలు తీసుకుంటామని సిబ్బందికి భరోసా కల్పించారు. విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే తమ కర్తవ్యమన్నారు. ఏఓ నిజాముద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చాగలమర్రి: పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి మరో బైక్ వేగంగా ఢీ కొట్టడంతో ఓ మహిళకు తీవ్రగాయాలైన ఘటన గొడిగనూరు గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని డి.వనిపెంట మజరా గ్రామమైన చెంచుగూడేనికి చెందిన ఇళ్ల రమణమ్మ ఆమె భర్త బయ్యన్న పని మీద ద్విచక్ర వాహనంపై చాగలమర్రికి వెళ్లి తిరిగి వస్తుండగా గొడిగనూరు గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన వారు బైక్‌తో వెనుకవైపు నుంచి ఢీ కొట్టడంతో రమణమ్మ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కేరళ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించాలని వైద్యుల సూచనల మేరకు కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో నంద్యాలకు తీసుకెళ్లారు.

అలరించిన భజన



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై అనంతపురం జిల్లాకు చెందిన జి.సుబ్బిరెడ్డి, బృందం భజన కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో శివశివ శంకరా భక్తవ శంకరా, ఓం నమఃశివాయ, పాతాళగంగమ్మ పాదాలు కడుగగా, పానగా భరణ, బ్రహ్మమురారి, అమ్మా పరమేశ్వరి తదితర భక్తిగీతాలు, అష్టకాలను ఆదినారాయణ, బాట ఆదెన్న, వెంకటరాముడు, పుల్లయ్య, ప్రసాద్, కర్రెన్న తదితరులు ఆలపించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మహానంది: బండిఆత్మకూరు మండలం ఎరుకల కాలనీ గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ రమాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పిల్లలు,గర్భిణులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని చెప్పారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో శనివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తామని ఆహ్వాన కమిటీ, గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 3న గణపతి పూజ, గోపూజ, గంగాపూజ, నాంది, మాతృక పూజ, యాగశాల ప్రవేశం, స్వస్తి, పుణ్యాహవాచనం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, దీక్షా హోమం, జలాధివాసం, మంగళహారతి, 4న ప్రాతఃకాల పూజ, విగ్రహాలకు మహాస్నపానం, చండీహోమం, అవాహితదేవతా హోమం, మహా మంగళహారతి, 5న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, కక్షజ్వాలా, మహాపూర్ణాహుతి తోపాటు కలశ ఉద్వాసన, కుంభాభిషేకం, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): మహిళా రెజర్ల పట్ల అవమానకరంగా ప్రవర్తించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయం నుంచి శ్రీనివాస సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారుణిలను లైంగిక వేధింపులకు గురి చేసిన బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో క్రీడాకారులు ఆందోళనలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ, శ్రీనివాసులు, రియాజ్, డప్పు ఖలీల్, కరీముల్లా పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు 184 దరఖాస్తులు

ఉయ్యాలవాడ: ఈ ఏడాది జనవరి నుంచి మే నెలాఖరు వరకు మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్త పింఛన్లకు అర్హతలు కలిగిన 184 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఏఓ సత్యన్న తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 93 మంది వృద్ధాప్య, 55 మంది వితంతు, 19 మంది దివ్యాంగులు, 13 మంది చర్మ కళాకారులు, ఒంటరి, డప్పు, మత్స్యకారులకు సంబంధించి నలుగురు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. ప్రభుత్వం ఆమోదం పొందిన వెంటనే పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

చాగలమర్రి : వైఎస్సార్ కడప జిల్లా, దువ్వూరు మండలం, కానగూడురు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాగలమర్రి మండలం, ముత్యాలపాడు గ్రామానికి చెందిన గౌస్‌బాషా (27) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం కడప పట్టణంలోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్లను స్థానిక అలంకార మండపంలో కొలువుంచి విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, అలంకార పూజల అనంతరం గోమాతను ఉత్సవానికి ముందు ఉంచి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేపట్టారు.

తప్పిన ప్రమాదం

వెలుగోడు: పట్టణంలో శుక్రవారం వీచిన గాలులు వర్షం ధాటికి చెట్లు నేలకొరిగాయి. ఆత్మకూరు-నంద్యాల రహదారిలో చెక్‌పోస్టు కార్యాలయం సమీపంలో కానుగ చెట్టు వేర్లతో సహ విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ మాబాషాకు చెందిన రేకుల షెడ్డుపై పడింది. అయితే చెట్టు పూర్తిస్థాయిలో షెడ్డుపై పడకపోవడంతో ప్రమాదం తప్పింది.

పింఛన్ల పంపిణీ



దివ్యాంగ వృద్ధురాలు రామక్కకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ వెంకట పుల్లయ్య

దొర్నిపాడు: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ రెండు రోజులుగా కొనసాగుతుంది. గ్రామ వలంటీర్లు పోటాపోటీగా తమ క్లస్టర్‌లోనే ముందు పూర్తిచేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నారని ఎంపీడీఓ నాగఅనసూయ శుక్రవారం తెలిపారు. చనిపోయిన వారివి తప్పా మొత్తం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 9 సచివాలయాల పరిధిలో 3,674 పింఛన్లు ఉన్నాయని ఇప్పటి వరకు 97 శాతం పంపిణీ పూర్తయ్యిందని వివరించారు.

సేవలోనే ఆత్మ సంతృప్తి



నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

నంద్యాల(రూరల్): పేదలకు సేవ చేయడంలోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఎస్‌బీఐ లైఫ్ రాయలసీమ జనరల్ మేనేజర్ క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయిబాబానగర్‌లో ఉన్న లలితా గ్లోబల్ కమ్యూనికేషన్ సంస్థ మొదటి వార్షికోత్సవానికి క్రాంతికుమార్, నంద్యాల ప్రభుత్వాసుపత్రి వైద్యుడు అబ్రహాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఏడాదిలో సంస్థ ఆధ్వర్యంలో 206 మందికి రక్తదానం, జిల్లాలోని 9 గ్రామాల్లో ఉచితంగా ప్రముఖ వైద్యులతో వైద్య పరీక్షలు, వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉన్నత విద్య, ప్రముఖ కోచింగ్ సెంటర్ల అధ్యాపకులతో ఉచితంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం నంద్యాల ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు ఉచితంగా మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజన సదుపాయాన్ని సంస్థ నిర్వాహకులు చేపట్టారు. సంస్థ నిర్వాహకులు మోటగడ్ల శ్రీనివాసులు, సభ్యులు కృష్ణంరాజు, కృష్ణయ్య, లలితాదేవి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి..కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామానికి చెందిన నడిపి లింగమయ్యపై అదే గ్రామానికి చెందిన శంకరయ్య దాడికి పాల్పడ్డాడని ఎస్ఐ తిరుపాల్ శుక్రవారం తెలిపారు. గురువారం దొర్నిపాడులో జరుగుతున్న ఎదుల బలప్రదర్శన పోటీల్లో శంకరయ్య పాతకక్షలు మనస్సుల్లో పెట్టుకొని నడిపి లింగమయ్యపై కర్రతో తలపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఒక రోజు..ఆర్.కొత్తూరు-ఆర్.కొత్తపల్లె గ్రామాల మధ్య ఉన్న చింత చెట్టు కిందనున్న అరుగుపై యువకులు కూర్చున్నారు. ఇంతలో ఎండలో ఇద్దరు కూలీలు దాహంతో వచ్చి కుండలోని నీరు తాగి కాసేపు విశ్రాంతి తీసుకొని వెళ్లారు. నీటితో పాటు మజ్జిగ ఇస్తే ఎలాగుంటుందని వారు చర్చించుకున్నారు. అనుకున్నదే తడవుగా మరుసటి రోజు కుండలు తీసుకొచ్చి మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. రెండు నెలలుగా నేటికీ వందలాది కూలీల దాహం తీరుస్తూ వారి మన్ననలు పొందుతున్నారు.

పది మంది కలిశారు..

ప్రజల దాహం తీర్చారు





కవ్వంతో పెరుగును మజ్జిగగా చిలుకుతున్న దృశ్యం, మజ్జిగతో దాహం తీర్చుకుంటున్న బాటసారులు

- ఏప్రిల్‌లో పొలాల బాటలో మజ్జిగ కేంద్ర ఏర్పాటు
- కూలీలు, రైతుల దాహం తీరుస్తున్న యువకులు

రుద్రవరం: యువత పెడదోవ పడుతుందంటారు..అది నిజం కాదని కొందరు యువకులు ప్రజాసేవలో ముందుంటున్నారు. జీవితంలో స్థిర పడటంతో పాటు పది మందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేస్తున్నామని నిరూపించారు ఆర్.కొత్తపల్లె, ఆర్.కొత్తూరు గ్రామాలకు చెందిన పది మంది యువకులు. దారి పక్కన చింత చెట్టు కింద ఉన్న అరుగుపై మజ్జిగ చలి వేంద్రం ఏర్పాటు చేశారు. రెండు నెలలుగా నిత్యం వందలాది మంది బాటసారుల దాహం తీర్చుతూ మన్ననలు పొందుతున్నారు.

చందాలతో..

మండలంలోని ఆర్.కొత్తూరు,కొత్తపల్లె గ్రామాలకు చెందిన నరసింహారెడ్డి, గురుప్రసాద్, రాముడు, పెద్దవీరభద్రుడు, ఉసేన్‌రెడ్డి, తలారి గపూర్, రామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, మాబ్బాషా, హరిప్రసాద్, టైలర్ బాలు అనే యువకులు దారిన వెళ్లే బాటసారుల దాహం తీర్చాలని భావించారు. అంతే.. అనుకున్నదే తడవుగా వారంతా తమకు తోచినంత చందాలు వేసుకొని కొంత సొమ్ము పోగు చేశారు. ఆ సొమ్ముతో రుద్రవరం-ఎర్రగుడిదిన్నె దారిలో ఆర్.కొత్తూరు వద్ద చింత చెట్టు కింద ఉన్న అరుగుపై ఏప్రిల్ 1న మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు.

నిర్వహణ ఇలా..

పది మంది యువకుల్లో కొందరు ఉదయాన్నే ఇంటి వద్ద పనులు ముగించు కొని ఒక్కొక్కరుగా చలి వేంద్రం వద్దకు చేరుకుంటారు. ముందుగా వచ్చిన వారు అరుగు పరిసరాలను శుభ్రం చేస్తారు. మరి కొందరు రుద్రవరానికి వెళ్లి 10 కేజీల పెరుగు బకెట్లు తీసుకొస్తారు. వాటిలోని పెరుగును డ్రమ్ముల్లో వేసి కవ్వంతో చిలికి మజ్జిగ సిద్ధం చేసి దారిన వచ్చి వెళ్లే వారికి అందజేసి దాహం తీర్చుతున్నారు. తొలుత 10 కేజీల పెరుగుతో ప్రారంభించగా.. రాను రాను ఒక్కో రోజు పది బకెట్ల పెరుగును మజ్జిగా మార్చాల్సి వస్తోంది. రుద్రవరానికి చెందిన కూలీలు దాదాపు 25 ఆటోల్లో వందలాది మంది ఎర్రగుడిదిన్నె మీదుగా ఇతర మండలాల్లో ఎండు మిర్చి కోతలకు వెళ్తున్నారు. ఉదయాన్నే వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చే సమయంలో ఎండలు తీవ్రంగా ఉండటంతో మజ్జిగ కేంద్రం వద్ద ఆటోలు నిలిపి కూలీలందరూ అక్కడే మజ్జిగ తాగి దాహం తీర్చుకుంటారు. అలాగే ఉపాధి పనులు చేసే కూలీలు, ధాన్యం తూకాలు వేసే హమాలీలు, బాటసారులు అక్కడ ఆగి మజ్జిగ తాగి వెళ్తున్నారు. ప్రస్తుతం వారికి కొందరు దాతల నుంచి సహకారం లభించడంతో కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఎండలు తగ్గే వరకు చలివేంద్రం కొనసాగిస్తామని యువకులు పేర్కొంటున్నారు.